
సాక్షి ఖమ్మం

శనివారం ¡ 11 ¡ మార్చి ¡ 2023



వచ్చేది బీసీల రాజ్యమే..

ఎన్ని అడ్డంకులు ఎదురైనా వచ్చేది జీసీల రాజ్యమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ కృష్ణయ్య తెలిపారు. 10లో



'సింగరేణి'లో గుర్తింపు కదలిక

సింగరేణిలో కార్మిక సంఘాల నేతలతో ఈనెల 13న అధికారుల భేటీ జరగనుండగా, ఎన్నికల తేదీ ఖరారవుతుందని తెలుస్తోంది. 10లో

గరిష్టం / కనిష్టం 37° / 19°

వాతావరణం

శనివారం ఉదయం జిల్లాలో చలి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నానికి మాత్రం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

అడవులపై అటవీ శాఖ నిఘా

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని అటవీ భూముల్లో బోర్లు వేయడానికి అటవీ ఉద్యోగులు సహకరిస్తుండడం, ఈ విషయం బయటపడగా ముగ్గురిపై వేటు పడిన నేపథ్యాన ఇక ముందు అక్రమాలు జరగకుండా అధికారులు దృష్టి సారించారు. ఈ విషయమై శుక్రవారం సాక్షిలో 'బోరుకైనా ఓకే.. సాగుకైనా సరే' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కూసుమంచి డివిజన్లలోని అటవీ భూములపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈమేరకు నియమించిన బృందాలు శుక్రవారం ఆయా డివిజన్లలో పర్యటించడంతో పాటు ఉదయం బేస్ క్యాంపుల్లో విధులు నిర్వర్తిస్తూనే రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచాలని డివిజనల్, రేంజ్ అధికారులను జిల్లా అధికారి ఆదేశించారు. అలాగే, అటవీ భూముల్లో బోర్లు వేస్తే వాహనాలను సీజ్ చేస్తామని బోర్‌వెల్స్ యజమానులను హెచ్చరించినట్లు అధికారులు తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా, పకడ్బందీగా నిర్వహించేలా అందరూ సహకరించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన విధులు కేటాయించిన ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ జిల్లాలో 63కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రథమ సంవత్సరం 17,890, ద్వితీయ సంవత్సరం 17,967మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్ల నుంచి ప్రశ్నాపత్రాలను తీసుకెళ్లే సమయాన జాగ్రత్తలు పాటించడంతో పాటు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో డీఈసీ మెంబర్లు కె.శ్రీనివాసరావు, వీరభద్రరావు, హెచ్‌పీసీ మెంబర్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మం స్పోర్ట్స్: నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పంచాప్రాన్ కార్యక్రమానికి దరఖాస్తు గడువు పొడిగించారు. ఈమేరకు ఆసక్తి ఉన్న యువజన సంఘాలు ఈనెల 24వ తేదీ వరకు జిల్లా నెహ్రూ యువక కేంద్రం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయొచ్చని జిల్లా అధికారి చింతల అన్వేష్ తెలిపారు. దరఖాస్తులను పరిశీలించాక, అర్హత కలిగిన సంఘాలకు కేంద్రప్రభుత్వం నుంచి రూ.20వేల చొప్పున నిర్వహణ ఖర్చులు అందుతాయని పేర్కొన్నారు.

వచ్చేనెల 10నుంచి ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

నేలకొండపల్లి: యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వచ్చే నెల 10వ తేదీన ప్రారంభిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ వెల్లడించారు. మండలంలోని రాజేశ్వరపురానికి శుక్రవారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 234 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి దాదాపు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కేంద్రాల్లో ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తొలి కేంద్రాన్ని ఏప్రిల్ 10న సత్తుపల్లి మండలంలో ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, తహసీల్దార్ దారా ప్రసాద్, చెరుకు అభివృద్ధి మండలి డైరెక్టర్ వీరెల్లి నాగరాజు పాల్గొన్నారు.

టార్పాలిన్ల నాణ్యత తనిఖీ

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సరఫరా చేసిన టార్పాలిన్ల నాణ్యతను శుక్రవారం జిల్లా సహకార అధికారి విజయకుమారి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.నాగరాజు తనిఖీ చేశారు. రైతులు పంట ఉత్పత్తులను తీసుకొచ్చినప్పుడు ఎండా, వాన రక్షించుకునేందుకు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఖమ్మం, మధిర, వైరా, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్లకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ టార్పాలిన్లు కేటాయించింది. ఈమేరకు ఉన్నతాధికారులతో సూచనతో డీసీఓ, డీఎంఓ తనిఖీ చేశారు. తనిఖీల్లో మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దే ఆసరాగా కబ్జా!



ఎఫ్‌టీఎల్ హద్దు దిమ్మె కనిపించకుండా ఊరచెరువు శిఖంలో పోస్తున్న మట్టి

- ఇతర సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్.. చెరువు శిఖంలో పాగా
- యథేచ్ఛగా ఖానాపురం ఊరచెరువు పరిధిలో ఆక్రమణలు
- ఇప్పటికే 12 రిజిస్ట్రేషన్లు గుర్తించిన జలవనరుల శాఖ అధికారులు
- నేడు సర్వేకు రెవెన్యూ ఉద్యోగుల నిర్ణయం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/ఖమ్మంఅర్బన్: చెరువు శిఖం భూములకు రక్షణ లేకుండా పోతోంది. ఏ కొద్ది ఆసరా దొరికినా కబ్జాదారులు చెలరేగిపోతున్నారు. ఇదేక్రమంలో జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఖానాపురం ఊరచెరువు సైతం ఆక్రమణదారుల వలలో చిక్కి విలవిల్లాడుతుండడం గమనార్హం. ఖానాపురం రెవెన్యూ, బల్లేపల్లి రెవెన్యూ సరిహద్దులో ఈ ఊరచెరువు భూమి కొంత భాగం ఉండడం కబ్జాదారులకు కలిసొస్తోంది. ఇతర సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తులు ఖానాపురం ఊరచెరువు భూముల్లో కార్యకలాపాలు సాగిస్తుండడం గమనార్హం. గురువారం సైతం ఖానాపురం ఊరచెరువు సర్వేనంబర్ 13లో కొందరు మట్టి నింపుతుండగా జలవనరుల శాఖ అధికారులు అడ్డుకున్నారు.

కొన్నేళ్లుగా ఇదే తంతు

ఖానాపురం ఊరచెరువుపై కొన్నేళ్లుగా కబ్జాదారుల కన్ను పడింది. సర్వేనంబర్ 13లో ఈ చెరువు విస్తీర్ణం 75.23 ఎకరాలు ఉండగా. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న పట్టాల భూములు 57.17 ఎకరాలతో కలిపి మొత్తం 133 ఎకరాలు ఉంటుంది. గతంలో ఈ చెరువు ద్వారా సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందేది. ఇల్లెందు ప్రధాన రోడ్డుకు సమీపాన ఉన్న చెరువు వద్ద భూమి విలువ గజం రూ.లక్షకు పైగా ఉండడంతో ఎఫ్‌టీఎల్ భూమిలో ఇప్పటికే చాలా వరకు కబ్జా చేసేశారు. ఇక్కడ ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ధారించిన అధికారులు బోర్డులు ఏర్పాటుచేసినా పట్టించుకోకుండా కబ్జాదారులు తమ పని కానిచ్చేస్తుండడంతో ఊరచెరువు నానాటికీ రూపం కోల్పోతోంది.

12 రిజిస్ట్రేషన్ల గుర్తింపు..

ఖానాపురం ఊరచెరువు ఎక్కువ భాగం ఖానాపురం రెవెన్యూ పరిధిలో, కొంత భాగం బల్లేపల్లి రెవెన్యూ పరిధిలో ఉంది. దీంతో సరిహద్దులోని భూమిపై పలువురి కన్నుపడింది. ఇంకేముంది వేరే సర్వేనంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకుని.. ఊరచెరువు శిఖంలో నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలోనే జలవనరుల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించినా భూమి విలువ ఎక్కువగా ఉండడంతో కబ్జాదారులు వెనక్కి తగ్గడం లేదు. ఈమేరకు ఇతర సర్వేనంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఖానాపురం ఊరచెరువు పరిధి భూమిని ఆక్రమించుకున్న 12 రిజిస్ట్రేషన్లను జలవనరుల శాఖ అధికారులు గుర్తించారు. అలాగే, చెరువు చుట్టుపక్కల భూముల రిజిస్ట్రేషన్ సమయాన తమకు సమాచారం ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్‌లకు లేఖ రాసినట్లు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు కఠినంగా వ్యవహరించకపోతే ఊరచెరువు భవిష్యత్‌లో కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది.

మట్టి పోస్తుండగా అడ్డుకుని..

తాజాగా గురువారం ఖానాపురం ఊరచెరువు పరిధిలోని సర్వేనంబర్ 13లో కొందరు మట్టి పోసి చదును చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. అలాగే, శుక్రవారం జలవనరుల శాఖ డీఈ ఉదయ్‌ప్రతాప్ వెళ్లగా, అక్కడి వ్యక్తులు సర్వేనంబర్ 231 పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాగితాలను చూపించారు. అయితే, మట్టిపోస్తున్న భూమి సర్వే నంబర్ 13లోనిదని చెప్పడంతో పాటు సర్వే నిర్వహించాలని రెవెన్యూ అధికారులను డీఈ కోరారు. దీంతో శనివారం సర్వే చేపట్టనున్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. కాగా, ఊరచెరువు చుట్టూ వెంచర్లు ఏర్పాటుకావడంతో సొంత భూమికి తోడు చెరువు శిఖంను కలిపేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎఫ్‌టీఎల్ దిమ్మెలు కనిపించకుండా పూడ్చేస్తుండడం గమనార్హం. చెరువు సమీపాన ఇటీవల ఓ వెంచర్ చేయగా, అందులో చెరువు శిఖం ఉండడంతో రిజిస్ట్రేషన్‌ను ఉన్నతాధికారులు నిలిపివేసినట్లు తెలిసింది. కాగా, జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన బోర్డును కూడా వెంచర్ బాధ్యులు తొలగించగా... శనివారం చేపట్టే సర్వేలో అసలు విషయం తేలుతుందని భావిస్తున్నారు.



శిఖం భూమిలో తనిఖీ చేస్తున్న జలవనరుల శాఖ అధికారులు

మత్స్యకారులకు అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన జెడ్పీ సీఈఓ అప్పారావు, మత్స్య శాఖాధికారి స్వామి, అధికారులు

- తద్వారా ప్రభుత్వ పథకాలతో ప్రయోజనం
- 'ఆక్వా' పథకాలపై సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో మత్స్య సంపద పెంపు, మత్స్యకారులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ఆక్వా కల్చర్ జిల్లా స్థాయి సమావేశంలో అధికారులు, ఆక్వా రైతులు పాల్గొనగా కలెక్టర్ మాట్లాడారు. నీలి విప్లవాన్ని సృష్టించేందుకు అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చేపల చెరువుల నిర్మాణం, హేచరీల ఏర్పాటు కోసం ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ వస్తుందని చెప్పారు. ఈమేరకు ఆక్వా రైతులకు పథకాలపై అవగాహన కల్పించాలని, దరఖాస్తులను త్వరగా పరిశీలించి గ్రౌండింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా మత్స్య అధికారి ఆంజనేయస్వామి, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, డీపీఓ విజయ నిర్మల, జిల్లా నీటిపారుదల అధికారి వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో తనిఖీ

కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలను కలెక్టర్ గౌతమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు ఉద్యోగులతో మాట్లాడిన ఆయన సమయపాలన, ఈ–ఆఫీస్ నిర్వహణ అంశాలపై సూచనలు చేశారు. ఆతర్వాత పిల్లల సంరక్షణ కేంద్రాన్ని కూడా పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కలెక్టర్ వెంట ఏఓ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

వైరాలో అభివృద్ధి పనుల పరిశీలన

వైరా: వైరా మున్సిపాలిటీతో పాటు మండలంలో కలెక్టర్ గౌతమ్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా బాలికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మన ఊరు – మన బడి కింద చేపట్టిన పనులను తనిఖీ చేసిన ఆయన కాంట్రాక్టర్, ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆతర్వాత వైరా మున్సిపాలిటీ సమీపాన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు, జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్, టాయిలెట్లు, వైరా ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించాక 8వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేసి పరీక్ష చేయించుకున్నారు. డీఎంహెచ్‌ఓ బి.మాలతి, డీఈఓ సోమశేఖరశర్మ, ఈఈలు నాగశేషు, కేవీకే.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అనిత, తహసీల్దార్ ఎస్.అరుణ, డీఈ నవీన్, ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి పాల్గొన్నారు,

'నకిలీలు' ఐదుగురి అరెస్ట్

తప్పుడు సర్టిఫికెట్లతో భూమి రిజిస్ట్రేషన్ కేసు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని తనగంపాడు రెవెన్యూ పరిధిలో స్థల యజమానులు బతికే ఉన్నా చనిపోయినట్లు తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాక ఇతరులకు అమ్మిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు ఐదుగురిని అరెస్టు చేయగా, మరికొందరు పరారీలో ఉన్నారని ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి శుక్రవారం రాత్రి వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. తనగంపాడులో కోదండరామిరెడ్డికి కొంత పట్టాభూమి ఉండగా, ఆయన వ్యాపారరీత్యా కుటుంబంతో హైదరాబాద్‌లో ఉంటున్నారు. గత కొన్నేళ్లుగా రాకపోవడాన్ని ఆసరాగా తీసుకున్న మేడ్చల్ జిల్లా మేడిపల్లికి చెందిన తాడూరి నిరంజన్‌రెడ్డి రంగంలోకి దిగి కోదండ రామిరెడ్డి – పద్మావతి మృతి చెందినట్లుగా నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించాడు. అంతేకాక తానే వారసుడినని అధికారులను నమ్మించి కోదండరామిరెడ్డి పేరిట ఉన్న భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అనంతరం కాసాని వెంకటేశ్వర్లుకు అమ్మాడు. ఈక్రమంలో అనుమానం వచ్చిన అధికారులు నిశితంగా పరిశీలించగా నిరంజన్‌రెడ్డి సమర్పించింది తప్పుడు సర్టిఫికెట్ అని నిర్ధారించుకున్న డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ గతనెల 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ బస్వారెడ్డి ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి నిరంజన్‌రెడ్డితో పాటు ఈవ్యవహారంలో పాలుపంచుకున్న గూడురుపాడుకు చెందిన పాడేటి నాగేశ్వరరావు, నేలకొండపల్లికి చెందిన ముత్తినేని వీరయ్య, కాసాని వెంకటేశ్వర్లు, వల్లభికి చెందిన ఐనాల రామారావును అరెస్ట్ చేశారు. అయితే, ఈ కేసులో ఇంకా మరికొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని, రెవెన్యూ ఉద్యోగుల పాత్రపై కూడా విచారణ జరుగుతోందని ఏసీపీ తెలిపారు. కాగా, మరికొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని పోలీసులు చెబుతుండటంతో అక్రమార్కులు కేసు నుంచి బయట పడేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

జిల్లాకు జ్వరమొచ్చింది..



పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

- ఏ ఇంట చూసినా బాధితులే
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు
- దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో జనం ఇబ్బంది

ఖమ్మం వైద్యవిభాగం: అకాల జ్వరాలతో జిల్లావాసులు అల్లాడిపోతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా జ్వర బాధితులు నానాటికీ పెరుగుతున్నారు. గత పది రోజుల నుంచి జ్వరం బారిన పడే వారి సంఖ్య నానాటికీ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, శ్వాసకోశ ఇబ్బందులు తదితర లక్షణాలతో ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని, మరో వారం, పదిరోజులు కొనసాగి ఆతర్వాత తగ్గుముఖం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. చలికాలం ముగిసి వేసవి ప్రవేశిస్తుండడంతో చోటుచేసుకుంటున్న కాలానుగుణ మార్పులు వ్యాధులు వ్యాప్తి చెందడానికి కారణంగా తెలుస్తోంది.

ప్రతీచోట అదే పరిస్థితి

పల్లె, పట్నం అనే తేడా లేకుండా జ్వరపీడితులు పెరిగిపోతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తుండగా.. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు వచ్చేవారు పెరుగుతున్నారు. పల్లె దవాఖా నాలు, పీహెచ్‌సీలతో పాటు జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో కొద్దిరోజులుగా ఓపీ కేసులు పెరిగిపోతున్నాయి. ప్రతీరోజు వంద మందికి పైగా జ్వరబాధితులు వస్తుండడం గమనార్హం. ఇక చిన్నపిల్లలను కూడా జ్వరం వదలకపోవడంతో రోజూ పెద్దాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగానికి 50కి మంది వస్తున్నట్లు తెలుస్తోంది.

జాగ్రత్తలు పాటిస్తేనే కట్టడి

ఇన్‌ఫ్లుయెంజా కేసులు ఇటీవల విపరీతంగా పెరుగుతున్నాయి. నోటి తుంపర్ల ద్వారా ఈ వైరస్ ఇతరులకు వ్యాపిస్తుందని.. ప్రధానంగా పిల్లలు, వృద్ధులు దీని బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారానే జ్వరాలను కట్టడి చేయొచ్చని సూచిస్తున్నారు. కాగా, ఈ వైరస్ కోవిడ్ అంత ప్రమాదకరమైనది కాకపోయినా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నలుగురిలోకి వచ్చినప్పుడు మాస్క్ తప్పక ధరించాలని సూచిస్తున్నారు. ఏటా వేసవి మొదలయ్యే సమయాన వైరస్‌ల వ్యాప్తి సహజమేనని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

ఇటీవల పెద్దాస్పత్రిలో చేరిన వారి వివరాలు

తేదీ	ఓపీ	ఐపీ
1	1,813	121
2	1,660	130
3	1,569	126
4	1,690	133
5	258	82
6	2,100	149
7	836	121
8	941	91
9	763	76

రోగనిరోధక శక్తి పెంచుకోవాలి



వాతావరణంలో వచ్చిన మార్పులతో జ్వరాలు సోకుతున్నాయి. ప్రధానంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు వైరస్‌ల బారిన పడతారు. అందువల్ల పోషకాహారం తీసుకుంటూ రోగనిరోధక శక్తి పెంచుకోవాలి. బయటకు వెళ్లినప్పుడు మాస్క్ తప్పక ధరించి పరిశుభ్రత పాటించాలి. జ్వరం, ఇతర ఇబ్బందులు ఎదురైతే చికిత్స తీసుకుంటే రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంది. ఈ విషయంలో ఆందోళన అవసరం లేదు.

– డాక్టర్ వేము గంగరాజు, ఫిజీషియన్

తెలంగాణలో బీజేపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

ఏన్కూరు: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఏన్కూరులో శుక్రవారం ఏర్పాటుచేసిన శక్తికేంద్రం ఇన్‌చార్జ్‌ల విస్తారక్‌ల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని శాంతిభద్రతలు క్షీణించి మహిళలు, విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్ర ప్రదీప్, నాయకులు కొవ్వూరి నాగేశ్వరావు, నెల్లూరి కోటేశ్వరావు, మోహన్‌రెడ్డి, నల్లబోతుల రమేష్, ఏలే భద్రయ్య, కోసూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన పరంజా

తృటిలో తప్పిన ప్రమాదం



కుప్ప కూలిన పరంజా



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన పరంజా కర్రలు ఒక్కసారిగా కుప్పకూలగా పెనుప్రమాదం తప్పింది. ఖమ్మం విజయనగర్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌కు ఎలివేషన్ కోసం రోడ్డు వైపు పరంజాలు కట్టగా.. శుక్రవారం సాయంత్రం ఒరిగిపోయి కుప్పకూలింది. క్షణాల ముందే ఆటో, ద్విచక్రవాహనదారుడు ఆ ప్రాంతాన్ని దాటడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పరంజాలు కట్టడంలో నిర్లక్ష్యం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతోనే ఇలా జరిగిందని స్థానికులు ఆరోపించారు. పరంజా కర్రలన్నీ ఒక్కసారిగా కరెంట్ తీగలపై పడడంతో ఐదు స్తంభాలు పక్కకు ఒరగడంతో పాటు తీగలు తెగిపోయాయి. ఈ కారణంగా గృహాల్లో విద్యుత్ నిలిచిపోయిందని, పలువురి ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయని స్థానికులు ఆరోపించారు. ఈమేరకు కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చేరుకుని పరిశీలించగా, విద్యుత్ అధికారులు చేరుకుని సరఫరాను పునరుద్ధరించారు.

రూ.కోటి బీమా చెక్కు అందజేత



జడ్జికి చెక్కు అందజేస్తున్న న్యాయవాది

ఖమ్మంలీగల్: గతనెల 11న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు చొరవతో రోడ్డు ప్రమాద కేసులో కక్షిదారులకు రూ.కోటి పరిహారం లభించింది. ఈమేరకు గో డిజిట్ బీమా సంస్థ అధికారులు శుక్రవారం జిల్లా జడ్జికి రూ.కోటి చెక్కును న్యాయవాది ద్వారా అందచేశారు. టాటా ప్రాజెక్ట్ కంపెనీలో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న త్రినాథ్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆయన తల్లిదండ్రులు రూ.కోటి పరిహారం కోరుతూ న్యాయస్థానంలో కేసు దాఖలు చేశారు. ఈ కేసు లోక్ అదాలత్‌లో రాజీ కాగా రూ.కోటి పరిహారం చెల్లించేందుకు బీమా సంస్థ అంగీకరించింది. ఈమేరకు చెక్కు అందజేసిన బీమా సంస్థ న్యాయవాది బండారుపల్లి గంగాధర్, ప్రతినిధులను న్యాయమూర్తి అభినందించారు.

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం, బేడా మండపంలో కొలువుదీరిన స్వామి, అమ్మవారి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

క్లుప్తంగా

‘దళితబంధు’ను సద్వినియోగం చేసుకోండి



కారును పరిశీలిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

చింతకాని: దళితబంధు పథకం ద్వారా మంజూరైన యూనిట్లను లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని డీఆర్డీఓ విద్యాచందన సూచించారు. మండలంలోని తిమ్మినేనిపాలెంలో యూనిట్లను శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ యూనిట్లతో లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధిస్తూనే మరికొందరికి ఉపాధి కల్పించాలని సూచించారు. యూనిట్ల నిర్వహణలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూసుకోవాలని, ఎవరైనా దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దమ్మాలపాటి శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

30నుంచి జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు



పోటీల పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధు

కూసుమంచి: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో ఈనెల 30 నుండి మూడు రోజుల పాటు జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు జరగనున్నాయి. ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, ఇంటూరి శేఖర్ యూత్ ఆధ్వర్యాన జరగనున్న ఈ పోటీలతో పాటు జాతీయ స్థాయి మహిళల ప్రో కబడ్డీ పోటీల నిర్వహణకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు పోటీల పోస్టర్లను శుక్రవారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆవిష్కరించి మాట్లాడారు. ఏటా జీళ్లచెరువులో పోటీలు నిర్వహిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌ను అభినందించారు. అనంతరం శేఖర్ జన్మదిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అన్నదానాన్ని ప్రారంభించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇంటూరి బేబీ, వైస్ ఎంపీపీ పద్మ, సర్పంచ్ కొండా సత్యంతో పాటు అంబాల ఉమ, వేముల వీరయ్య పాల్గొన్నారు.

ఇంటికి రూ.462... నల్లాకు రూ.6,600!

ఖమ్మంఅర్బన్: ఆర్థిక సంవత్సరం చివరకు రావడంతో వంద శాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో ఉన్న కేఎంసీ అధికారులు జారీ చేసే నోటీసుల్లో తప్పులు దొర్లుతుండడం ఇళ్ల యజమానులకు దడ పుట్టిస్తోంది. నగరంలోని 10వ డివిజన్‌కు చెందిన జెల్లి హరికృష్ణ రేకుల షెడ్లు నిర్మించుకుని జీవిస్తుండగా, గతంలో రూ.1 నల్లా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. ఆతర్వాత మిషన్ భగీరథ నల్లా మాత్రం బిగించారు. ఇంతలోనే ఇంటికి రూ.462 పన్ను చెల్లించాలని నోటీసు ఇచ్చిన కేఎంసీ అధికారులు, నల్లా పన్ను మాత్రం రూ.6,600 చెల్లించాలని మెసేజ్ పంపారు. దీంతో హరికృష్ణ కేఎంసీ కార్యాలయానికి వెళ్లగా, నగరంలో ఇలాగే చాలా మందికి వచ్చిందని చెబుతూ.. సోమవారం గ్రీవెన్స్‌లో కమిషనర్‌ను కలవాలని సూచించి పంపించేశారు.

ఒంటరి వృద్ధురాలి ఆత్మహత్య

- మూడు రోజుల తర్వాత గుర్తింపు

చింతకాని: కారణాలేమిటో తెలియదు కానీ అందరూ ఉన్నా ఆమె ఒంటరిగా జీవిస్తోంది. ఈక్రమంలో మూడు రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా, ఇంటినుంచి దుర్వాసన వస్తుండడంతో మూడు రోజుల తర్వాత స్థానికులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతర్లపాడుకు చెందిన సామినేని పద్మావతి(55)కి భర్తతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమార్తె ఉన్నారు. పిల్లల వివాహాలు కాగా హైదరాబాద్, మధిరలో స్థిరపడ్డారు. కాగా, పద్మావతి భర్త గ్రామంలోని మరో ఇంట్లో నివసిస్తుండగా ఆమె ఒక్కరే ఉంటోంది. అప్పుడప్పుడు ఆమె మతిస్థిమితం లేనట్లుగా వ్యవహరిస్తుందని సమాచారం. ఈక్రమంలో ఇంటి తలుపులు వేసుకున్న ఆమె మూడు రోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే, ఇంటి నుంచి శుక్రవారం దుర్వాసన వస్తుండడంతో పక్కింటి వారు చూసి సమాచారం ఇచ్చారు. ఘటనపై మృతురాలి కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు.

విద్యార్థుల్లో ఒకరిగా !

పాఠశాలల్లో పిల్లలతో మమేకమైన కలెక్టర్ గౌతమ్



బాలికోన్నత పాఠశాలలో పాఠం బోధిస్తున్న కలెక్టర్ గౌతమ్



బాలికలతో కలిసి పాఠం వింటున్న కలెక్టర్ గౌతమ్, పక్కన డీఈఓ శర్మ



గురుకుల పాఠశాలలో బాలికలతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

వైరా: ఆయన జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్.. పాఠశాలలో పనుల తనిఖీకి వెళ్లిన సమయాన అంతటితో సరిపెట్టుకోకుండా విద్యార్థులకు పాఠం బోధించడంతో పాటు వారి సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయుడు చెబుతున్న పాఠం కూడా విన్నారు. వైరాలోని బాలికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు – మన బడి పథకం ద్వారా చేపట్టిన పనులను కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి గదిలోకి వెళ్లి ఆంగ్ల పాఠాన్ని డీఈఓ సోమశేఖరశర్మతో కలిసి విన్నారు. ఆ తర్వాత తాను స్వయంగా ఓ పాఠం బోధించారు. అలాగే, తెలంగాణ గురుకుల పాఠశాలకు వెళ్లి ఐదో తరగతి విద్యార్థినులతో మాట్లాడాక మధ్యాహ్న భోజన సమయం కావడంతో బాలికలతో కలిసి నేలపై కూర్చుని భోజనం కానిచ్చేశారు. ఈక్రమంలో డార్మెటరీ భవనం కురుస్తోందని బాలికలు చెప్పగా నూతన భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

పంటలు ఎండిపోతున్నాయి సార్..



తల్లాడ : వరి పొలంలో నిరసన తెలుపుతున్న రేజర్ల రైతులు



కల్లూరు : కప్పలబంధం రెగ్యులేటర్ వద్ద పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

తల్లాడ: తల్లాడ మండలం సిరిపురం మేజర్ కాల్వ పరిధిలోని తల్లాడ, రేజర్ల, కొత్త వెంకటగిరి గ్రామాల ఆయకట్టుకు ఎన్నెస్పీ జలాలు అందడం లేదు. దీంతో వరి పైర్లు ఎండిపోతున్నాయని రేజర్లలో రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో 23 రోజుల నుండి సాగర్ నీరు రాక పైర్లు ఎండిపోతున్నాయని ఆరోపించారు. రైతులు ఇనుపనూరి బుచ్చాలు, భూషణం, పుల్లారెడ్డి, కొండయ్య, వసంతరావు, జాను, రాంప్రసాద్, సీతారాములు, నాగయ్య పాల్గొన్నారు. కాగా, ఈ విషయమై ఎన్నెస్పీ డీఈ శ్రీనివాసరావును వివరణ కోరగా చివరి ఆయకట్టు వరకు నీరందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సరిపడా నీరు విడుదల చేయండి

కల్లూరు: సాగర్ జలాలను సరిపడా విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కల్లూరు జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు కోరారు. ఈమేరకు శుక్రవారం వారు రైతులతో కలిసి జలవనరులశాఖ ఎస్ఈ అప్పలనాయుడు, ఈఈ లక్ష్మణరావుకు వినతిపత్రాలు ఇచ్చారు. అనంతరం అధికారులతో కలిసి కప్పలబంధం రెగ్యులేటరీ వద్ద పరిశీలించారు. ఈమేరకు కిందకు సాగునీటి సరఫరాను నిలిపేసి మధిర బ్రాంచ్ కెనాల్‌కు మళ్లించారు. ఇరిగేషన్ డీఈలు రాజారత్నం, వెంకటేశ్వరరావుతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు నర్వనేని అంజయ్య, ఎస్.కే.కమ్లి, కొరకొప్పు ప్రసాద్, పుసులూరి శ్రీనివాసరావు, జక్కంపూడి కిషోర్, వల్లపునేని రవి, తన్నీరు కృష్ణార్జునరావు, మాదాల వెంకటేశ్వరరావు, ముదిగుండ్ల అంజయ్య, బట్టు నరసింహారావు, వాడపల్లి లాలు, తాళ్ల నరసింహారావు, నల్లగట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీటిసంప్‌లో పడి చిన్నారి మృతి



రాము (ఫైల్)

రఘునాథపాలెం: తల్లి ఇంట్లో ఉంది.. తండ్రి బయటకు వెళ్లాడు... తండ్రితో పాటే కుమారుడు వెళ్లి ఉండొచ్చని తల్లి భావిస్తుండగా ఇంటి ఆవరణలోని తాగునీటి సంప్‌లో పడిన బాలుడు ఊపిరి ఆడక మృతి చెందిన విషాద ఘటన మండలంలోని రాంక్యాతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తేజావత్ గాంధీ – జ్యోతి తమ కుమారుడు రాము(5)తో కలిసి ఉదయం పొలానికి వెళ్లి మధ్యాహ్నం వచ్చారు. ఆతర్వాత జ్యోతి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా, తండ్రి గాంధీ వాలీబాల్ ఆడేందుకు వెళ్లాడు. అయితే, రాము తండ్రితో కలిసి వెళ్లాడని జ్యోతి భావించి ఇంట్లోనే ఉండిపోయింది. కానీ రాము ఆడుకుంటూ బయటకు వెళ్లి మూత లేని సంప్‌లో పడగా ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈమేరకు సాయంత్రం 5గంటల సమయాన ఆమె బయటకు వచ్చే సరికి సంప్ లో మృతదేహం తేలుతుండడంతో కన్నీరుమున్నీగా విలపించింది. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు కన్నుమూయడంతో తల్లిదండ్రులు రోదించిన తీరు అందరికీ కంటతడి పెట్టించింది.

పెళ్లి వేడుకలో విషాదం..

- దండంపై బట్టలు ఆరేస్తూ షాక్‌తో యువకుడు మృతి

సత్తుపల్లిరూరల్: స్నేహితుడి ఇంట్లో పెళ్లికి వచ్చిన యువకుడు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కల్లూరుకు చెందిన ఆకునూరి మణికంఠ(27) సత్తుపల్లి మండలం బేతుపల్లిలో తన స్నేహితుని సోదరి పెళ్లి కోసం గురువారం వచ్చాడు. ఆయన స్నానం చేశాక తడి బట్టలను ఇనుప దండెంపై ఆరవేస్తుండగా ఆ వైర్‌కు కరెంట్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో గమనించిన స్నేహితులు సరఫరా నిలిపేసి మణికంఠను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బీటెక్ పూర్తి చేసిన ఆయన స్నేహితుడి ఇంట్లో శుభకార్యానికి వచ్చి మృతి చెందగా విషాదం నెలకొంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాము తెలిపారు.

రాజేశ్వరపురంలో పట్టపగలే చోరీ

నేలకొండపల్లి: ఓ ఇంట్లో యజమాని నిద్రిస్తుండగా, తలుపులు తీసి ఉండడాన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు మిట్టమధ్యాహ్నం చోరీకి పాల్పడ్డారు. మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన పోలంపల్లి శ్రీను పక్షవాతంతో లేవలేని పరిస్థితి ఉండగా, గురువారం మాత్రలు వేసుకుని ఇంట్లోనే నిద్రించాడు. ఆ సమయాన ఆయన భార్య మంగమ్మ తలుపు తీసి వ్యవసా య పనులకు వెళ్లింది. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు పట్టపగలే ఇంట్లోకి వచ్చి బీరువా తెరిచి ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, 18 తులాల పట్టీలు, రూ.5 వేల నగదు చోరీ చేశారు. ఆతర్వాత మళ్లీ బీరువా తలుపులు యథావిధిగా వేసి వెళ్లిపోయారు. అయితే, శుక్రవారం ఉదయం బీరువా తెరిచి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో నేలకొండపల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, శ్రీను లేవలేని పరిస్థితుల్లో ఉన్నట్లు తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్పష్టమైన లక్ష్యాలతోనే విజయం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, చైర్‌పర్సన్ హృదయమీనన్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఖమ్మంక్రైం: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలు ఎంచుకుని, వాటి సాధనకు కృషి చేస్తేనే విజయం సొంతమవుతుందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. నగరంలోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాల 28 వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులు చదువుతో అన్ని రంగాల పై మక్కువ పెంచుకుని సమాజానికి ఉపయోగపడేలా ఆవిష్కరణలు చేయాలన్నారు. సీపీ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యనభ్యసించడం ద్వారా ఉన్నతస్థాయికి ఎదగొచ్చన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్, సీపీతో పాటు స్కూల్ చైర్ పర్సన్ హృదయ్ మీనన్ బహుమతులు అందించగా, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఏసీపీలు రామోజీ రమేష్, ప్రసన్నకుమార్, సీఐలు అంజలి, అశోక్, ఆర్ఐలు రవి, శ్రీనివాస్, సాంబశివరావు, శ్రీశైలం, ప్రిన్సిపాల్ రాజు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తులో మునిగి తేలుతున్న యువత?

మధిర: మధిరలో కొందరు యువకులు మత్తుకు బానిసలవుతున్నట్లు తెలుస్తోంది. మద్యం, గంజాయి ఖరీదు ఎక్కువ కావడంతో ఎక్కడైనా చవకగా లభించే వైట్‌నర్‌లు, టైర్ల పంక్చర్‌కు ఉపయోగించే లోషన్ కొనుగోలు చేసి పీలుస్తున్నట్లు సమాచారం. ఈమేరకు మధిర వ్యవసాయ మార్కెట్, దళిత కాలనీ, రాజీవ్ నగర్, అంబేద్కర్ సెంటర్ తదితర ప్రాంతాల్లో కొందరు యువకులు వీటిని పీలుస్తున్నట్లు సమాచారం అందడంతో మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి ఆదేశాల మేరకు టౌన్ పోలీసులు వారితో పాటు తల్లిదండ్రులను ఇటీవల పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే, యువకులకు వైట్‌నర్, లోషన్లు విక్రయించొద్దని షాపుల యజమానులకు సూచించారు. ఇదిలాగే కొనసాగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమ్మా... 11న వస్తా అన్నాడు

హైదరాబాద్‌లో గుండెపోటుతో మధిర యువకుడు మృతి



కొట్టె మురళీకృష్ణ (ఫైల్)

మధిర: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన కొట్టె మురళీకృష్ణ (26) గుండెపోటుకు గురై గురువారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందాడు. వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన కొట్టె కృష్ణ, రాధ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మురళీకృష్ణ ఉన్నారు. కృష్ణ తాపీమేస్త్రీగా, రాధ కూలి పనులు చేస్తూ ఇద్దరు కుమార్తెల వివాహం జరిపించారు. ఇక మురళీకృష్ణ హైదరాబాద్‌లోనే ప్రైవేట్ ఉద్యోగిగా చేస్తూ ఇటీవల శిక్షణ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. పదిహేను రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లిన ఆయన ఈనెల 13న కొత్త కంపెనీలో చేరాల్సి ఉండడంతో 11వ తేదీన వస్తానని తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో స్నేహితులతో కలిసి కారులో సినిమాకు వెళ్లి వస్తుండగా మురళీకృష్ణ ఛాతిలో నొప్పి వస్తోందంటూ కుప్పకూలాడు. దీంతో స్నేహితులు ఆయనకు సీపీఆర్ చేస్తూనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు తెలిపారు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి తీసుకురాగా, జీవితంలో స్థిరపడుతూ తమను మంచిగా చూసుకుంటానని చెప్పే ఒక్కగానొక్క కొడుకు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గణేషన్‌పాడులో రైతు..

పెనుబల్లి: మండలంలోని గణేషన్‌పాడు పంచాయతీకి చెందిన రైతు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన మెట్టుల అశోక్ (42) వ్యవసాయం చేస్తుండగా, శుక్రవారం ఉదయం గుండెపోటు వచ్చింది. దీంతో ఆయనను ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా కాసేపటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలుశిక్ష

సత్తుపల్లిటౌన్/మధిర: భార్యను హత్య చేసేందుకు యత్నించిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు... మధిర ఆజాద్‌రోడ్డుకు చెందిన కార్పొరేటర్ తాళ్లూరి పూర్ణచంద్రాచారి 2018 మార్చి 27న రాత్రి మద్యం సేవించాక, భార్య నిర్మలపై అనుమానంతో గ్యాస్ స్టౌపై ఉన్న వేడినూనెను ఆమెపై పోశాడు. ఆమెకు తీవ్ర గాయాలు కాగా అడ్డొచ్చిన కుమారుడిపైనా దాడి చేశారు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు మధిర టౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈకేసులో భాగంగా 11 మంది సాక్షులను విచారించాక పూర్ణచందర్‌రావుపై నేరం రుజువు కావడంతో ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. పోలీసు అధికారి తిరుపతిరెడ్డి దర్యాప్తు చేసిన ఈకేసును ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ అబ్బుల్‌బాషా వాదించగా, సిబ్బంది కళింగరెడ్డి, బుద్దా శ్రీనివాసరావు సహకరించారు.

ఉత్కంఠభరితంగా ఎడ్ల పందేలు, కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలం చెరువుమాదారంలో అంకమ్మ జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు, కబడ్డీ పోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. ఉత్కంఠభరితంగా సాగుతున్న ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు పళ్ల విభాగంలో 9 జతల ఎడ్లతో రైతులు హాజరయ్యారు. పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చారు. ఇక కబడ్డీ పోటీల్లోనూ క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. సర్పంచ్ ఈవూరి సుజాత, ఎంపీటీసీ కనమర్లపూడి పుష్పలత, సొసైటీ చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్‌తో పాటు ఆకుల వెంకటేశ్వర్లు, ఈవూరి శ్రీనివాసరెడ్డి, చౌడం నాగేశ్వరరావు, యడవల్లి సైదులు, తుమ్మా ధనమూర్తి, కనమర్లపూడి రాము, పగిడిపత్తి బాలయ్య, అమరగాని యల్లయ్య, ఆకుల మల్లేష్, శివారెడ్డి, రామచంద్రుడు, యడవల్లి చంద్రయ్య, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

అవినాశ్‌పై తొందరపాటు చర్యలొద్దు..

సోమవారం వరకు అరెస్టు సహా.. ఏ చర్యలూ వద్దన్న తెలంగాణ హైకోర్టు

సీబీఐకి మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి అన్ని విచారణ ఫైళ్లను, రికార్డులను న్యాయస్థానం ముందు ఉంచాలని సీబీఐ దర్యాప్తు అధికారిని హైకోర్టు ఆదేశించింది. విచారణ వివరాలను పెన్‌డ్రైవ్ లేదా హార్డ్ డిస్క్‌లో పూర్తిగా సీల్డ్ కవర్‌లో సోమవారం కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. వివేకా హత్య జరిగిన చోట లభించిన లేఖ, దానికి సంబంధించిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదికను కూడా సమర్పించాలని సూచించింది. అప్పటి వరకు అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని దర్యాప్తు అధికారి (ఐవో)ని ఆదేశించింది. పిటిషనర్ (కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి) 14న ఉదయం 11 గంటలకు సీబీఐ ముందు హాజరు కావాలని సూచించింది. ఆయన వెంట న్యాయవాది వెళ్లొచ్చని చెప్పింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, తదుపరి విచారణను 13వ తేదీకి వాయిదా వేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తనను శుక్రవారం విచారణకు హాజరు కావాలనడంపై స్టే విధించాలని కోరుతూ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా.. అదంతా ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున అనిల్ కొంపెల్లి వాదనలు వినిపించారు.

పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు..

'వైఎస్ వివేకా హత్య కేసులో విచారణ నిమిత్తం సీఆర్‌పీసీ 160 కింద జనవరి 24న హాజరు కావాలని ఒకరోజు ముందు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు జారీ చేసింది. 24న ఎంపీ విచారణకు హాజరయ్యారు. తన విచారణ వీడియో, ఆడియో రికార్డింగ్ చేయాలని, విచారణ సమయంలో తన న్యాయవాదిని అనుమతించాలని కోరుతూ జనవరి 27న దర్యాప్తు అధికారులకు అవినాశ్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. దీన్ని దర్యాప్తు అధికారి అనుమతించలేదు. మళ్లీ ఫిబ్రవరి 24న హాజరు కావాలంటూ ఫిబ్రవరి 16న నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 22న కూడా అవినాశ్‌రెడ్డి వీడియో, ఆడియో రికార్డింగ్‌పై విన్నవించారు. అప్పుడు కూడా అనుమతించలేదు. మరోసారి మార్చి 10న విచారణకు రావాలని మార్చి 5న సీఆర్‌పీసీ 160 కింద మరో నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో విచారణ పారదర్శకంగా సాగడం లేదని, నిష్పక్షపాతంగా సాగేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు' అని నిరంజన్‌రెడ్డి వివరించారు.

విచారణ పేరుతో వేధిస్తున్నారు..

'వివేకా హత్య కేసుకు సంబంధించి సీబీఐ ముందు పిటిషనర్ విచారణ ముగియగానే, మీడియా ఇష్టం



వచ్చినట్లు కథనాలు రాస్తూ, ఆయన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తోంది. వాస్తవాలను పట్టించుకోవడం లేదు. అందువల్లే వీడియో, ఆడియో రికార్డు చేయాలని దర్యాప్తు అధికారులను ఎంపీ కోరారు. అయినా దర్యాప్తు అధికారి దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. విచారణ సమయంలో పిటిషనర్ చెబుతున్న అంశాలను టైపిస్ట్ టైప్ చేస్తుండగా, దర్యాప్తు అధికారి కంప్యూటర్ మౌస్‌ను పలుమార్లు తన చేతుల్లోకి తీసుకుని కొన్ని లైన్లు తీసివేయాలంటూ టైపిస్ట్‌కు సూచించారు. కంప్యూటర్ స్క్రీన్ దర్యాప్తు అధికారికి, టైపిస్ట్‌కు మాత్రమే కనిపించేలా ఉండటంతో ఏం డిలీట్ చేస్తున్నారో పిటిషనర్ చూడలేకపోయారు. అవినాశ్‌ను విచారణ చేసే సమయంలో నలుగురైదుగురు అధికారులు ఉన్నారు. విచారణ ముగిశాక దీనికి సంబంధించిన ఓ ప్రతిని ఇవ్వమని కోరినా, దర్యాప్తు అధికారి నిరాకరించారు. నిబంధనలు అంగీకరించవని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో పిటిషనర్ వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలివ్వాలి. ఎఫ్ఐఆర్ సహా ఎక్కడా అవినాశ్ పేరు లేదు. అయినా పలుమార్లు విచారణ పేరుతో వేధిస్తున్నారు. దర్యాప్తు అధికారి.. ముందే ఓ ఊహాజనిత స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకుని, ఆ మేరకు కావాల్సిన విధంగా సాక్షులను సిద్ధం చేస్తున్నారు. అవినాశ్‌రెడ్డితోపాటు భాస్కర్‌రెడ్డిని కూడా దోషిగా చూపించే ప్రయత్నం జరుగుతోంది. దస్తగిరిని వారికి అనుకూలంగా మలచుకుని, ఆ మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు' అని వాదనలు వినిపించారు.

వీడియో రికార్డింగ్‌తోనే విచారణ

వీడియో, ఆడియో రికార్డింగ్‌పై దర్యాప్తు అధికారి వివరణ తీసుకుని కోర్టుకు తెలియజేయాలని న్యాయమూర్తి.. సీబీఐ న్యాయవాదిని ఆదేశించారు.

వివేకా లేఖను తొక్కిపెట్టారు..

'వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను దర్యాప్తు అధికారులు తొక్కిపెడుతున్నారు. వైఎస్ వివేకా అల్లుడే ఆయన్ను హత్య చేశాడని నిందితుడు శివశంకర్‌రెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయితే ఈ కేసు అంశాలను మాత్రం సీబీఐ అధికారులు ఇప్పటివరకు పట్టించుకోలేదు. సీఆర్‌పీసీలో పేర్కొన్న నిబంధనల మేరకు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పాటించడం లేదు. ఈ నేపథ్యంలో పిటిషనర్ వీడియో, ఆడియో రికార్డు చేసేలా, న్యాయవాదిని విచారణ సమయంలో అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలి' అని పిటిషనర్ న్యాయవాది నివేదించారు.

భోజన విరామం అనంతరం వాదనలు పునః ప్రారంభం కాగా, వీడియో, ఆడియో రికార్డింగ్‌లతోనే పిటిషనర్ విచారణ సాగుతోందని సీబీఐ న్యాయవాది కోర్టుకు నివేదించారు. వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను ఫోరెన్సిక్‌కు పంపినట్లు చెప్పారు. లేఖ విషయాన్ని 2021 జనవరి 31 నాటి అనుబంధ చార్జిషీట్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. అవినాశ్‌రెడ్డి.. సాక్షినా? లేక నిందితుడా? అని న్యాయమూర్తి ప్రశ్నించగా, అవినాశ్‌రెడ్డికి సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు ఇచ్చామని.. అవసరమైతే ఆయన్ను, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొనే అవకాశం ఉందని సీబీఐ న్యాయవాది చెప్పారు. ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన సీబీఐ ఎస్పీ.. ఆడియో, వీడియో రికార్డుల హార్డ్‌డిస్క్, కేసు ఫైళ్లను ఇప్పుడే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సోమవారం సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు. కాగా, ఈ పిటిషన్‌లో వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. పిటిషన్‌లో తన పేరు ప్రస్తావించినందున తన వాదనలు కూడా వినాలని కోరారు.

దస్తగిరి ఎందుకు రాలేదు?

వైఎస్ వివేకా హత్య కేసులో ఏ-4గా ఉన్న దస్తగిరి విచారణకు ఎందుకు రాలేదని సీబీఐని ప్రత్యేక న్యాయస్థానం ప్రశ్నించింది. నిందితులంతా హాజరు కావాలని చెప్పాం కదా.. అని అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు అందరూ రావాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంగా చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. మరో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి కూడా హాజరయ్యారు. సీబీఐ నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌లో కొన్ని పేజీలు లేవని, దీంతో దాన్ని తిరిగి పంపించామని న్యాయమూర్తి వెల్లడించారు.

కేసు విచారణను వేగవంతం చేయాలని ఆదేశిస్తూ వాయిదా వేశారు. అనంతరం ముగ్గురు నిందితులను పోలీసులు మళ్లీ చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా ఎంపీ అవినాశ్‌రెడ్డి వెంట వచ్చిన 15 మంది మద్దతుదారులను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వివేకాది ఆస్తి కోసం జరిగిన హత్య

- సీబీఐ విచారణ అనంతరం ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి
- హత్యా స్థలి నుంచి లెటర్‌ను మాయం చేశారు
- గుండెపోటని నేను చెప్పలేదు..
- నేను ఏ తప్పూ చేయలేదు.. న్యాయ పోరాటానికి సిద్ధం

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డిది మర్డర్ ఫర్ గెయిన్ (ఆస్తి, సొమ్ము కోసం జరిగిన హత్య) అని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సీబీఐ విచారణ తప్పుదోవలో వెళ్తోందని తాను మొదటి నుంచీ చెబుతూనే ఉన్నానని, అది గూగుల్ టేకౌట్ కాదు టీడీపీ టేకౌట్ అని అన్నారు. తప్పుడు సాక్ష్యాలతో అన్యాయంగా అమాయకులను ఇరికించేలా కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దర్యాప్తులో చాలా కీలక అంశాలను పక్కన పెట్టి, సిల్లీ అంశాలను తెరపైకి తెచ్చి తనకు అంటగట్టే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. సీబీఐ విచారణకు మూడోసారి శుక్రవారం హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వివేకాకు రెండో పెళ్లి.. వారికి ఓ కుమారుడు..

- వివేకం సార్‌కు 2006 నుంచి ఒక యువతితో సంబంధం ఉంది. 2011లో ఆమెను పెళ్లి చేసుకున్నారు. దానికి ఇస్లాం లా ప్రకారం తన పేరు షేక్ మహ్మద్ అక్బర్‌గా మార్చుకున్నారు. పెళ్లి తర్వాత వారికి షేక్ షెహన్‌షా అనే అబ్బాయి కూడా పుట్టాడు. ఆ అబ్బాయినే వారసుడిగా ప్రకటించాలనే తపన, ఆలోచన ఆయనలో ఉండింది.
- హత్య జరగడానికి ముందు ఇల్లంతా డాక్యుమెంట్ల కోసం వెతికారని అప్రూవర్ స్టేట్‌మెంట్‌లోనే ఉంది. హత్య తర్వాత కూడా డాక్యుమెంట్లు వెరిఫై చేసుకుని వెళ్లారని చెప్పారు. నా అనుమానం ఏమిటంటే.. నోటరైజ్డ్ విల్లు అది. ఆమె (వివేకా రెండో భార్య) పేరుతోనో, వారి అబ్బాయి పేరుతోనో ఆస్తిని ఇవ్వాలనుకోవడం.. దీన్ని అడ్డుకోవాలనుకోవడం.. ఇందులో ఆసక్తి ఎవరికి ఉందో తెలియాలి.
- నా అనుమానం ప్రకారం ఇది మర్డర్ ఫర్ గెయిన్. అందులో భాగంగానే వాళ్లు వివేకానందరెడ్డి గారిని ఇలా చేశారు. రాబోయే రోజుల్లోనూ న్యాయ పోరాటం చేస్తా.

ఆ లేఖ ఎందుకు దాచారు?

- నేను గాలి మాటలు మాట్లాడట్లేదు. సొంత కవిత్వాలు చెప్పట్లేదు. రికార్డుల్లో ఉన్నవి, వాటి ద్వారా తెలిసినవే మాట్లాడుతున్నా. నేను వెళ్లే లోపలే సీన్ ఆఫ్ క్రైమ్‌లో ఉన్న లేఖను సునీతమ్మ భర్త రాజశేఖర్ దాచి పెట్టారు. పీఏ కృష్ణారెడ్డికి ఆ లెటర్ విషయం కానీ, అందులో ఉన్న అంశాలు కానీ ఎవరికీ చెప్పొద్దని చెప్పారు. దీంతో పాటు సెల్‌ఫోన్‌ను దాచిపెట్టడం తప్పు కాదా?
- నన్ను వెళ్లమని చెప్తేనే అక్కడకు వెళ్లాను. లెటర్ ఉన్న విషయం నాకు కూడా చెప్పలేదు. ఆ లెటర్ చాలా కీలక ఆధారం. సరైన సమయానికి దాని విషయం బయటకు చెప్పకపోవడం ఈ కేసులో పెద్ద తప్పు.



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ అవినాశ్‌రెడ్డి

- నేను ఏ ఒక్కరికీ గుండెపోటని (వివేకా మరణానికి కారణం) చెప్పలేదు. కావాలంటే ఆ రోజు మార్చురీ దగ్గర, మార్చి 17న మాట్లాడిన మాటలు చూడండి. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నేను అలా చెప్పినట్లు చిత్రీకరించింది.
- నేను చూసి బయటకు వచ్చి పోలీసులు, కుటుంబీకులు, దగ్గర బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పా. ఇవన్నీ చేయకుంటే తప్పంటారనుకున్నా. చేస్తే తప్పంటారని ఊహించలేదు.

ముమ్మాటికీ అది కట్టుకథే

- అప్రూవర్ థీయరీనే ఓ కట్టుకథ. ప్రారంభంలోనే గొడవ ప్రస్తావన. రూ.8 కోట్ల డబ్బు రావాల్సి ఉందో, వచ్చిందో వాటి గురించి గొడవ మొదలైందని చెప్తారు. ఆ షేర్ల పంపకం మీద వివేకం సారేమో మొత్తం నాకే కావాలని అన్నట్లు, వీళ్లేమో నువ్వు సగం తీసుకో, నేను సగం తీసుకుంటా అన్నట్లు గొడవ మొదలై ఉండొచ్చంటారు.
- ఇదే సీబీఐ విచారణలో ఆ బెంగళూరు సెటిల్‌మెంట్‌కు సంబంధించి ఎనిమిది మంది సాక్షులు (ఎల్‌డబ్ల్యూ 10 నుంచి మొదలై) చాలా స్పష్టంగా చెప్పారు. ఆ సెటిల్‌మెంట్ ఫెయిల్ అయింది.. ఒక్క రూపాయి డబ్బు కూడా వచ్చే అవకాశం లేదు.. ఆ డాక్యుమెంట్లు అన్నీ ఫోర్జరీ అని చెప్తారు. అంటే రాని, వచ్చే అవకాశమే లేని డబ్బు కోసం ఎవరైనా గొడవ పెట్టుకుని కొట్టి చంపుకుంటారా? ఇది కట్టు కథ అనడానికి ఇది చాలదా?

ఇది కుమ్మక్కు కాదా?

- సుప్రీంకోర్టులో మా సోదరి (సునీత) వైల్డ్ అలిగేషన్స్‌తో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను సమర్థిస్తూ సీబీఐ వాళ్లు కౌంటర్ అఫిడవిట్ వేస్తారు.

అందుకే నోరు విప్పాల్సి వస్తోంది..

- కేవలం కుట్రలకు ఉపయోగపడే వాంగ్మూలాలు తప్ప నిజాలను వెల్లడించే వాంగ్మూలాలు తీసుకోవట్లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను సరిగ్గా మద్దతు ఇవ్వలేదని ప్రచారం చేశారు. అభియోగాలు మోపారు. దాదాపు 800 పైచిలుకు ఎమ్మెల్సీ ఓటర్లు.. ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు ఉన్నారు. వారిని పిలిచి అడగండి. అదీ చేయరు. అప్రూవర్ థియరీ.. కట్టుకథను అడ్డం పెట్టుకుని విచారణను ఓ వ్యక్తి టార్గెట్‌గా ముందుకు తీసుకువెళ్తున్నారు.
- దీన్ని ఎవరూ హర్షించరు. దీంతో గళమెత్తడం మొదలుపెట్టాం. ఇప్పటి వరకు ఎన్ని విమర్శలు వచ్చినా, మీడియా ఎన్ని విమర్శలు చేసినా, మా సోదరి సునీతమ్మ సుప్రీంకోర్టులో, ఆంధ్ర హైకోర్టులో నాపై ఎన్ని ఆరోపణలు చేసినా మౌనంగానే ఉన్నా. ఎందుకంటే వివేకం సార్ చనిపోయారు.. ఈమె ఆయన కూతురు అని.. విచారణ జరుగుతున్నప్పుడు విచారణ సంస్థపై నమ్మకం ఉండాలని మౌనంగా ఉన్నాను. అయితే విచారణ తప్పుడుదోవలో వెళ్తోందని స్పష్టం కావడంతో నోరు విప్పుతున్నాను. నేను ఎటువంటి తప్పు చేయలేదని ప్రతి ఒక్కరికీ గట్టిగా చెబుతున్నా.

గురువారం లంచ్ మోషన్ మూవ్ చేస్తూ రెస్పాండెంట్స్‌గా సీబీఐ డైరెక్టర్, దర్యాప్తు అధికారిని పెట్టాం. మధ్యాహ్నం 2 గంటల కల్లా సీబీఐ వారి కంటే ముందు మా సోదరి తరఫు అడ్వకేట్లు వచ్చారు. అంటే వారికి ఎవరు సమాచారం ఇచ్చారు?

- సీబీఐ వాళ్లకు నోటీసు వచ్చిన వెంటనే చిటికలో సమాచారం ఇస్తున్నారు. ఆ రోజు సుప్రీంకోర్టులో కుమ్మక్కై పిటిషనర్‌కు అనుకూలంగా కౌంటర్ వేసి కోర్టులను తప్పుదోవ పట్టించారు. లంచ్ మోషన్‌లోనూ ఆమెకు సమాచారం ఇచ్చి ఇంప్లీడ్ చేయిస్తున్నారు. ఇది కుమ్మక్కు కాదా? దీని వెనుక పెద్ద కుట్రలు ఉన్నాయి. ఈ రాజకీయ కుట్రలను తప్పకుండా ఛేదిస్తాం. న్యాయ పోరాటం చేస్తాం. కంచే చేను మేస్తే.. సీబీఐ ఈ రకంగా కుమ్మక్కై విచారణ చేస్తే మాకు ఎవరు దిక్కు?.

తప్పుదోవలో విచారణ

- ఉదయం 10.40–10.45 గంటల మధ్య ఇక్కడికి వచ్చాను. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విచారించారు. ఆ తర్వాత కోర్టు నుంచి పిలుపు వచ్చిందని దర్యాప్తు అధికారి వెళ్లారు. అయినప్పటికీ 3.30 గంటల వరకు అక్కడే కూర్చోమన్నారు. ఆపై సీబీఐ వాళ్లు వచ్చి మీరు వెళ్లండి.. మళ్లీ మేము పిలిచినప్పుడు రండని చెప్పారు.
- విచారణ మొత్తం ఆడియో, వీడియో రికార్డింగ్ కావాలని దర్యాప్తు అధికారిని మొదటి నుంచీ అడుగుతూనే ఉన్నాం. రెండోసారి ఇదే అంశాన్ని సీబీఐ డైరెక్టర్‌నే అడిగాం. ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో మూడోసారి హైకోర్టును ఆశ్రయించాం. విచారణ తప్పుదోవలో వెళ్తుండటంతో ఇలా చేయక తప్పలేదు.
- ఎంపీ టిక్కెట్టే ఈ హత్యకు కారణం అంటే మా జిల్లా వాళ్లు నవ్వుతారు. వివేకం సర్ చనిపోయే రోజు కూడా మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు మండలంలో దాదాపు 300 ఇళ్లు డోర్ టు డోర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా రఘురామిరెడ్డికి.. ఎంపీ అభ్యర్థిగా అవినాశ్‌కు ఓటెయ్యండని ప్రచారం చేశారు. కావాలంటే ఆ ఇళ్లకు వెళ్లి అడగచ్చు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని అడగచ్చు.. వాంగ్మూలం తీసుకోవచ్చు. కానీ వీళ్లు (సీబీఐ) అలా అడగరు. వాంగ్మూలం తీసుకోరు.

జిల్లా వార్తలు

ప్యాసింజర్లు రద్దు, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రీ షెడ్యూల్



ఖమ్మం మామిళ్లగూడెం: విజయవాడ వైపు గంగినేని – ఎర్రుపాలెం ప్రాంతంలో మూడో రైల్వే లైన్ పనులు జరుగుతున్న దృష్ట్యా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. కొన్ని రైళ్లను పూర్తిగా రద్దుచేయగా, మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీ వరకు విజయవాడ–డోర్నకల్(07756), డోర్నకల్– విజయవాడ(07755), విజయవాడ–భద్రాచలం రోడ్డు (07979), భద్రాచలం–విజయవాడ(07278) ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఇక గుంటూరు–సికింద్రాబాద్(17201), సికింద్రాబాద్–గుంటూరు(17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్–కాజీపేట మార్గంలోనే నడిపిస్తుండగా, గుంటూరు–సికింద్రాబాద్(12705), సికింద్రాబాద్–గుంటూరు (12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్–ఖమ్మం వరకే రాకపోకలు సాగిస్తుందని అధికారులు వెల్లడించారు.

ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు

భద్రాచలం: ఉమ్మడి జిల్లాలోని కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల్లో ప్రవేశాలకు ఈనెల 12న జరిగే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ నుంచి శుక్రవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాళ్లతో జూమ్ మీటింగ్ ద్వారా ఏర్పాట్లపై సమీక్షించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో కుర్చీలు, డ్యూయల్ డెస్క్ బల్లలు ఏర్పాటు చేయడమే కాక తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మెడికల్ క్యాంపులను సిద్ధం చేయాలని తెలిపారు. సమీప పోలీసుస్టేషన్ల నుంచి పరీక్ష రోజు ఉదయమే ప్రశ్నపత్రాలు తీసుకురావాలని, విద్యార్థులు గంట ముందు కేంద్రాలకు వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ఏఐవైఎఫ్ జాతీయ సమితిలోకి రామకృష్ణ



ఖమ్మంమయూరిసెంటర్: ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నికయ్యారు. కారేపల్లి మండలం గాదెపాడుకు చెందిన ఆయనను జాతీయ సమితి సభ్యుడిగా పాండిచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో ఎన్నుకున్నారు. కాగా, రామకృష్ణను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, సిద్ధినేని కర్ణకుమార్ తదితరులు శుక్రవారం అభినందించారు.

సింగరేణిలో 'గుర్తింపు' కదలిక





- ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా డీవైసీఎల్సీ శ్రీనివాస్
- ఈనెల 13న కార్మిక సంఘాలతో హైదరాబాద్‌లో భేటీ
- వచ్చే నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించే అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఏడో విడత గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి పూర్తయినందున ఎన్నికలు నిర్వహించాలని కార్మిక సంఘాల నాయకులు కొన్నాళ్లుగా కోరుతుండగా స్పందన రాలేదు. ఈ నేపథ్యాన ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర కార్మిక శాఖ, డీవైసీఎల్సీ(సెంట్రల్‌కు) కోర్టు ఆదేశించింది. దీంతో గుర్తింపు సంఘం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా డీవైసీఎల్సీ శ్రీనివాస్‌ను నియమించగా, ఆయన ఈనెల 13న హైదరాబాద్‌లో అన్ని కార్మిక సంఘాలతో భేటీ కానున్నారు. ఈ సమావేశంలో చర్చించే అంశాల ఆధారంగా వచ్చే నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

2017లో చివరి ఎన్నికలు

సింగరేణిలో ఆరో విడత గుర్తింపు సంఘం ఎన్నికలు 2017 అక్టోబర్ 5న జరిగాయి. ఈ ఎన్నికల్లో భూపాలపల్లి, మందమర్రి ఏరియాలు మినహా మిగతా తొమ్మిది ఏరియాల్లో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. ఈ నేపథ్యాన కొన్ని కార్మిక సంఘాలు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎన్నికల కాలపరిమితి రెండేళ్లే ఉన్నందున సింగరేణిలో అలాగే అమలుచేయాలని కేంద్ర కార్మిక శాఖకు విజ్ఞప్తి చేశాయి. దీంతో కేంద్ర కార్మిక శాఖ సానుకూలంగా స్పందించగా, ఎన్నికల నిర్వహించే ముందు షెడ్యూల్ నాలుగేళ్లుగా ఉన్నందున తమనే కొనసాగించాలని టీబీజీకేఎస్ నేతలు కోర్టును ఆశ్రయించారు. అయితే, కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు రాకున్నా యాజమాన్యం ఎన్నికలు నిర్వహించలేదు. కాగా, 2021 అక్టోబర్ 5తో నాలుగేళ్ల కాలపరిమితి ముగియగా, అప్పటి నుంచి ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారు. ఇక సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి పూర్తయినందున ఎన్నికలు నిర్వహించలేకతే అన్ని సంఘాలకు సమాన హోదా కల్పించాలని కోరినా ఫలితం లేకపోయింది. చివరకు కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికల నిర్వహణకు అడుగులు పడుతున్నాయి.

నిర్వహించకపోతే మళ్లీ కోర్టుకు...



ఎన్నికల నిర్వహణపై అన్ని సంఘాలు డీవైసీఎల్సీకి లేఖలు ఇచ్చిన నేపథ్యాన ఎన్నికలు కచ్చితంగా నిర్వహించాల్సిందే. గత నవంబర్‌లో కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇకనైనా ప్రక్రియ ప్రారంభించకపోతే మళ్లీ కోర్టుకు వెళ్తాం.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

పులి చర్మం విక్రయానికి యత్నం

- ఛత్తీస్‌గఢ్‌లో కొని, హైదరాబాద్‌లో అమ్మకానికి పయనం
- అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులు తొమ్మిది మంది అరెస్టు

మంచుపల్లి: పులి చర్మంపై కూర్చుని ధ్యానం చేస్తే కనకవర్షం కురుస్తుందని నమ్మారు.. ఇతర రాష్ట్రానికి వెళ్లి మరీ పులి చర్మాన్ని కొనుగోలు చేశారు. కానీ అది అపోహేనని తెలియడంతో అధిక ధరకు అమ్ముదామని చర్మంతో బయలుదేరిన వారు అటవీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ముఠాలో మూడు రాష్ట్రాల వ్యక్తులు ఉండగా, వివరాలను కొత్తగూడెం అటవీశాఖ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఆరు నెలల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం చింతల్‌నార్ అటవీ ప్రాంతంలో ఉచ్చుకు చిక్కిన పులిని కొందరు బరిసెలతో పొడిచి చంపి చర్మాన్ని సేకరించారు. ఈ విషయం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మడకం ముఖేష్, మడకం జితేందర్, పూనెం సింఘాకు తెలిసింది. వీరికి గతంలో రైస్ పుల్లింగ్ పేరిట అమాయకులను దోచుకున్న అనుభవం ఉంది.



పులి చర్మం, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అటవీ అధికారులు

అలాగే, పులి చర్మంపై కూర్చుని ధ్యానం చేస్తే కనకవర్షం కురుస్తుందని ఎవరో చెప్పగా విన్నారు. దీంతో ఇదే మాటలు చెప్పి పులి చర్మాన్ని అమ్మి సొమ్ము చేసుకోవచ్చనే భావనతో పులి చర్మాన్ని కొనుగోలు చేశాక, గతంలో రైస్ పుల్లింగ్ వ్యాపారంలో పరిచయమైన ఏపీ చింతూరుకు ప్రాంతానికి చెందిన శుద్ధపల్లి శ్రీనివాస్, మాడవి కోసయ్య, కలుముల ఎర్రయ్య, ప్రకాశం జిల్లాకు చెందిన కందుకూరు ఫణీంద్ర, పస్నూరు చిరంజీవిని సంప్రదించారు. ఆతర్వాత గతంలో పరిచయమున్న భద్రాచలం సారపాకకు చెందిన గవర్రాజు వేణుకు చెప్పి కొన్నిరోజుల పాటు సారపాకలో పులి చర్మాన్ని దాచారు. అయితే, ఇక్కడ కాకుండా హైదరాబాద్ వెళ్లి చర్మాన్ని మరింత ధర వస్తుందనే భావనతో తొమ్మిది మంది అక్కడకు శుక్రవారం బయలుదేరారు. ఈక్రమంలో పక్కా సమాచారం అందడంతో ఫారెస్ట్ స్పెషల్ టీం కొత్తగూడెం సరిహద్దు ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరి నుంచి పులి చర్మంతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కొత్తగూడెం అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎ.అప్పయ్య వెల్లడించారు. ఈ సమావేశంలో అటవీ అధికారులు సురేష్‌కుమార్, ఉమ, వెంకటేశ్వర్లు, మస్తాన్‌రాజు, లక్ష్మణ్, పిచ్చయ్య, మోహన్, మదన్‌లాల్, సుమన్, సాగర్, మహేష్ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో వచ్చేది బీసీల రాజ్యమే..



సత్తుపల్లి టౌన్: సమావేశంలో అభివాదం చేస్తున్న కృష్ణయ్య, బీసీ సంఘాల నాయకులు

- చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడుదాం
- బిచ్చగాళ్లలా చూస్తున్న కేంద్రం వైఖరి సరికాదు
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ కృష్ణయ్య

సత్తుపల్లిటౌన్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా కేంద్రప్రభుత్వం ఇంకా బీసీలను బిచ్చగాళ్లగానే చూస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. అయితే భవిష్యత్‌లో వచ్చేది బీసీల రాజ్యమేనని.. దొరల రాజ్యం ఇక పోయినట్లేనని ఆయన అన్నారు. సత్తుపల్లిలో శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన బీసీ గర్జన మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే, బీసీ కార్పొరేషన్ కోసం ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీయాలన్నారు. అధికారం దక్కే వరకు ఐకమత్యంగా ఉద్యమించాలని సూచించారు.. నలభై ఏళ్ల పోరాటంతోనే హాస్టళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు దక్కినా ఇంకా వివక్షత ఉందని తెలిపారు. ఇప్పటి వరకు బీసీ కులాలకు కేంద్రం చేసిందేమీ లేదని చెప్పారు. ఉద్యమాలు, చదువుల ద్వారా మాత్రమే మార్పు వస్తుందని, ఇందుకోసం బీసీ సంఘాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, తనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజ్యసభ సీటు ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆర్.కృష్ణయ్యను నాయకులు సత్కరించారు.

చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఖమ్మం మయూరిసెంటర్: జనాభాలో 50శాతానికి పైగా బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్‌కు వచ్చిన ఆయన సౌకర్యాలపై శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం అందని ద్రాక్షలా మారిన నేపథ్యాన పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. అనంతరం కృష్ణయ్యను బీసీ సంక్షేమ సంఘాల నాయకులు స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రా సత్యనారాయణ, కన్వీనర్ లాల్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడేపల్లి కృష్ణమాచారి, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణితో పాటు చల్లారి వెంకటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, నాగాచారి, డి.వెంకటేశ్వరరావు, పిండిప్రోలు రామమూర్తి, కేసోజు రఘుబాబు, అనుముల సోమయ్య, రమేష్, చెన్నోజు పుల్లయ్య, పోతగాని రమణకుమార్, లగిశెట్టి మహేష్, కాసాని బ్రహ్మం, నలమా సుగుణ, గద్దె వెంకటరామయ్య, సావిడి శ్రీనివాస్, మేకల సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో కృష్ణయ్యను సన్మానిస్తున్న నాయకులు

రూ.95లక్షల బీమా పరిహారం చెల్లించండి..

ఖమ్మం లీగల్: అత్యవసర సమయంలో ఆదుకుంటుందని బీమా చేయిస్తే, నగదు చెల్లించని కంపెనీకి ఖమ్మం జిల్లా వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. ఖమ్మం ఖానాపురం హవేలీలోని ఆదర్శనగర్‌కు చెందిన బుర్రా వీరబాబు తన భార్య నిమ్మకాయల జ్యోతి పేరిట 2017 ఫిబ్రవరి 23న ముంబైలోని ఏగాన్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి పాలసీ తీసుకున్నారు. ప్రీమియంగా ఒక కోటి ఐదు లక్షల రూపాయలు చెల్లించగా, జ్యోతికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స పొందుతూ 2018 మార్చి 12 న మృతి చెందింది. ఈ విషయాన్ని వీరబాబు ఇన్సూరెన్స్ కంపెనీకి తెలియచేశాడు. అయినా కంపెనీ బాధ్యులు స్పందించకపోవడంతో ఆయన జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. దీంతో రూ.95 లక్షల బీమా నగదుతో పాటు ఖర్చుగా రూ.15 వేలు చెల్లించాలని చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత శుక్రవారం తీర్పు చెప్పారు.